సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 11 । మార్చి । 2024



బిల్లులు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: మధ్యాహ్నం భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీన లక్ష్మణ్ కోరారు.



ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం పేస్కేల్ ప్రకటించడంపై సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
36.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'కందేపి'కి ఉమెన్ ఐకాన్ అవార్డు



కందేపి రాణిప్రసాద్‌కు అవార్డు అందజేత

సిరిసిల్లటౌన్: బాలసాహిత్యవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్ మరో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఫిలాంతరోపిక్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్యరంగంలో విశేష కృషిచేస్తున్న సిరిసిల్లకు చెందిన బాలసాహిత్యవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్‌కు ఉమెన్ అవార్డును ప్రదానం చేశారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలోని ఎన్టీయార్ కళామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవీ చేతుల మీదుగా అందించారు. పీసీసీ అధికార ప్రతినిధి గాదిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జ్ఞానయజ్ఞం' కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జ్ఞానయజ్ఞం' కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా చిన్మయ మిషన్ కోఆర్డినేటర్ సజ్జనం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి జిల్లా కేంద్రంలోని బీవైనగర్ హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వామి యజ్ఞానందచే ప్రవచనాలు ఉంటాయని వివరించారు. మోతిలాల్, రాంచంద్రం, కోటేశ్వరీ, సృజన, రాజమణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'కుష్ఠు' గుర్తింపుపై స్పెషల్ డ్రైవ్



డాక్టర్ సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: నిక్షయ్ భారత్‌లో భాగంగా జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఉద్యమంలా చేపడుతున్నట్లు జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 476 మంది ఆశకార్యకర్తలు ఇంటింటికి వెళ్లి క్షయ వ్యాధిగ్రస్తులు, లక్షణాలు గుర్తిస్తారన్నారు. రిపోర్టుల ఆధారంగా వైద్యాధికారులు క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి, పూర్తిస్థాయి చికిత్స అందిస్తారని తెలిపారు. బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే అంగవైకల్యం కాకుండా కాపాడే అవకాశం ఉందన్నారు.



వైభవంగా గడ ఉత్సవం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో ఎల్లమ్మ సిద్ధోగంలో భాగంగా ఆదివారం గ్రామంలో గడ, పావనం ఉత్సవం నిర్వహించారు. గౌడకులస్తులు ఎల్లమ్మ ఉత్సవ విగ్రహం, గడ, పావనంతో భక్తుల ఇళ్లకు వెళ్లి ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఎల్లమ్మతల్లికి మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడకులస్తులు లింగాల యాదగిరి, లింగాల రాజు, బొల్గం గోవర్ధన్, లింగాల నరేందర్, లింగాల ప్రవీణ్, లింగాల శ్రీనివాస్, లింగాల సంజీవ్, మెరుగు గోవర్ధన్, లింగాల ప్రకాశ్, పల్లె వేణు, పల్లె సాయి తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన ఆశలు



ఇతను చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన ముద్దాల కొమురయ్య. తనకు నాలుగు ఎకరాల భూమి ఉండగా.. తమ ఊరిచెరువులో నీరు తక్కువగా ఉండడాన్ని గమనించి మూడు ఎకరాలలోనే వరి సాగు చేశాడు. బావి ఆధారంగా సాగు చేసిన పొలం నీరందక ఎండిపోతుంది. ఇప్పటికే 30 గుంటలకు పైగా పొలం ఎండిపోయింది. మూడు ఎకరాలలో వరి పంట వేస్తే ఎకరం కూడా చేతికొస్తుందో.. లేదోనని ఆందోళన చెందుతున్నాడు.



ఈ చిత్రంలో ఎండుతున్న పంటలు ఎల్లారెడ్డిపేట శివారులోనివి. సింగసముద్రం ఆయకట్టు 2,200 ఎకరాలు ఉన్నా.. ఎండాకాలం కావడంతో నీళ్లు అందకపోవచ్చనే ముందుచూపుతో రైతులు 1,600 ఎకరాలకే తైబందీ నిర్ణయించుకున్నారు. అయినా ఎల్లారెడ్డిపేట శివారు వరకు నీరు రాక దాదాపు 70 ఎకరాల వరకు పంటలు ఎండిపోయాయి. కాల్వలకు గండ్లు పడడం, పూడిక నిండిపోవడమే కారణమని రైతులు అంటున్నారు. పొట్టదశలో ఉన్న పంటలు చేతికొచ్చేనా అనే ఆందోళనలో అన్నదాతలు ఉన్నారు.



చెట్లు, ముళ్లపొదలు నిండిన ఈ కాల్వ సింగసముద్రం నుంచి వచ్చే బొప్పాపూర్–ఎల్లారెడ్డిపేట మధ్య ఉంది. కాల్వలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా చెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఈ ముళ్లపొదలను తొలగించకపోవడంతో నీటి సరఫరాకు అడ్డుగా మారాయి. నీటికి అడ్డుగా ముళ్లపొదలు, చెత్తాచెదారం ఉండడంతో ఒత్తిడి పెరిగి కాల్వల వెంట బుంగలు, గండ్లు పడుతున్నాయి. ఫలితంగా చివరి భూములకు నీరందడం లేదు.



కాల్వకు గండిపడిన ఈ ప్రాంతం బొప్పాపూర్‌లోని గంగమ్మగుడి. పైనుంచి నీరు ఉధృతంగా వస్తుండగా.. కాల్వ సరిగ్గా లేక సరఫరాకు అడ్డుగా మారింది. గండ్లు పడుతున్న సమయంలో నీరు వృథాగా పోవడం పరిపాటిగా మారింది. ఈ సమయంలో అధికారులకు రైతులు సమాచారం ఇస్తే సకాలంలో స్పందించడం లేదు. ఫలితంగా రైతులే బస్తాల్లో ఇసుకను నింపి తాత్కాలికంగా గండ్లను పూడ్చుకుంటున్నారు. అధికారులకు ముందుచూపు లేని కారణంగా గండ్లు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పడిపోతున్న భూగర్భజలాలు
- ఇప్పటికే 40వేల ఎకరాల్లో ఎండిన పంటలు
- 15 మీటర్ల అడుగుల లోతుకు చేరిన నీళ్లు
- గండ్లు పడుతున్న సింగసముద్రం కాల్వలు
- శిథిలావస్థలో తూములు
- శాశ్వత మరమ్మతు చేయాలంటున్న రైతులు

సింగసముద్రం స్వరూపం ఇలా..	నీటి సామర్థ్యం	ఆయకట్టు విస్తీర్ణం	ప్రధాన కాల్వలు	కనెక్టింగ్ కాల్వలు
	26 అడుగులు	2,200 ఎకరాలు	9	50



జోగాపూర్‌లో క్రేన్‌తో బావి తవ్విస్తున్న రైతు



చందుర్తిలో ఎండిన పొలంలో పశువులు

సాక్షి నెట్‌వర్క్ సాక్షి

చందుర్తి(వేములవాడ)/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. మొన్నటి వరకు పచ్చగా ఉన్న పంట పొలాలు బీటలు వారుతున్నాయి. మరో నెల రోజులు తడులు అందిస్తే పంట చేతికొస్తుందని ఆశపడ్డ రైతులకు నిరాశ ఎదురవుతుంది. ఈ ఎండాకాలం సీజన్‌లో జిల్లాలో 1.72లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఇప్పటికే దాదాపు 40వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. మిగిలిన పంటలను కాపాడుకునేందుకు పలువురు రైతులు వ్యవసాయ బావుల్లో పూడిక తీయిస్తుండగా, మరికొందరు కొత్తగా బోరుబావులను తవ్విస్తున్నారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు ముదిరితే మరెలా ఉంటుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

15 మీటర్లలోతుకు భూగర్భ జలాలు

జిల్లాలోని 13 మండలాల్లో కలిపి యాసంగిలో 1.72 లక్షల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారు. గతేడాదిలో అక్టోబర్ చివరి వరకు ఆశించిన మేరకు వర్షాలు కురియడంతో గ్రామాల్లోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ చెరువులు, కుంటల్లో 70 శాతం మేరకు నీళ్లు ఉండడంతో పంటలు ఎండిపోకుండా చేతికొచ్చాయి. ఈ యేడాది వర్షాకాలంలో సెప్టెంబర్ మూడో వారం వరకే వర్షాలు కురిసి ముఖం చాటేశాయి. దీంతో భూగర్భ జలాలు 8 మీటర్లలోతులో ఉన్నాయి. దీన్ని ముందే గమనించిన పలువురు రైతులు పంటల సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకున్నారు. మార్చి రెండో వారంలో ఎండలు ముదరడంతో భూగర్భజలాలు 15 మీటర్ల లోతుకు పడిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు కొందరు వ్యవసాయ బావుల్లో పూడికతీయిస్తుండగా, మరికొందరు బోర్లు వేయిస్తున్నారు.

ఎల్లంపల్లి నీరు విడుదల చేసినా..

వేములవాడరూరల్, చందుర్తి, రుద్రంగి మండలాల్లో సాగుచేసిన యాసంగి పంటలకు నీరందించేందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముందస్తుగా ఎల్లంపల్లి నీటిని విడుదల చేయించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఆశించిన మేరకు నీళ్లు లేకపోవడంతో నాలుగైదు రోజుల తర్వాత నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి.

ఆశలకు గండ్లు

ఎల్లారెడ్డిపేట మండల రైతుల వరప్రదాయిని సింగసముద్రం ప్రధాన కాల్వలు చెట్లు, ముళ్లపొదలతో నిండిపోయాయి. కనెక్టింగ్(అనుసంధాన) కాల్వలు పూడికతో కుంచించుకుపోయాయి. ఫలితంగా నిత్యం ప్రధాన, అనుసంధాన కాల్వలకు గండ్లు పడుతున్నాయి. పట్టించుకునే వారు లేక తరచూ రైతులే గండ్లు పూడుస్తున్నారు. అయినా అక్కడక్కడ నీరందక పంటలు ఎండిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే చివరి భూముల్లోని పంటలు చేతికి రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2200 ఎకరాల ఆయకట్టు

సింగసముద్రం పరిధిలోని నారాయణపూర్, రాచర్ల బొప్పాపూర్, కోరుట్లపేట, సర్వాయిపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాలలో 2200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఎండాకాలం సీజన్‌లో చివరి సమయంలో సాగు నీరు అందకపోవచ్చనే ఆలోచనతో ఆయకట్టు రైతులు సమావేశమై 1600 ఎకరాలకే తైబందీ నిర్ణయించారు. కానీ కాల్వలకు తరచూ పడుతున్న గండ్లతో చివరి ఆయకట్టు భూములకు నీరందడ లేదు. ఫలితంగా ఎల్లారెడ్డిపేట శివారులోని దాదాపు 70 ఎకరాలలో వరిపంట ఎండిపోయింది.

అందని గోదావరి నీరు

కాళేశ్వరం 9వ ప్యాకేజీలో భాగంగా 2013లో సింగసముద్రంను అందులో కలిపారు. దీంతో మల్కపేట నుంచి సింగసముద్రం వరకు 18 కిలోమీటర్ల కాల్వ పనులు చేశారు. అక్కడక్కడ పనులు పూర్తికాకపోవడంతో గోదావరి జలాలు సింగసముద్రానికి చేరుకోవడం లేదు. గోదావరి జలాలు సింగసముద్రానికి చేరి ఉంటే ఆయకట్టు పరిధిలోని 2,200 ఎకరాలు సాగులోకి వచ్చేవి.

రెండు మీటర్ల లోతులోకి..

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండంలో నెల రోజుల్లోనే రెండు మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. బావుల్లో పూడికలు తీయిస్తున్నారు. బోరుబావులు ఎత్తిపోతున్నాయి. నీరందక పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని కంచర్ల, వీర్నపల్లి, మద్దిమల్ల, రంగంపేట, అడవిపదిర, గర్జనపల్లి, వన్‌పల్లి గ్రామాల్లోని పలు బోరుబావులు ఎత్తిపోయాయి. ఇప్పటికే చాలా మంది రైతులు 400 నుంచి 500 అడుగుల లోతు వరకు బోర్లు వేయించి నీళ్లు పడక ఆర్థికంగా అబ్బందులు పడుతున్నారు.

పొలం వదిలిపెట్టిన



రెండున్నర ఎకరాలలో వరి సాగు చేశాను. పదేళ్లుగా ఎప్పుడూ బోరు వెనుకకు రాకుండా నీళ్లు పోసేది. నీళ్ల కరువు ఉండదని యాసంగిలో పొలం సాగుచేసిన. రెండు వారాల కింద నీళ్లు పోసే బోరు ఎండిపోవడంతో చేసేదేమి లేక పొలం వదిలిపెట్టిన. పెట్టుబడి ఖర్చులు రూ.90 వేలకు పైగా మీద పడింది.
– తిక్కల సునీల్, బావుసాయిపేట(కోనరావుపేట)

సగం పొలం ఎండుతుంది



నాకు మూడెకరాల పొలం ఉంది. గతంలో ఎప్పుడూ ఎండిపోలేదు. బావి ఆధారంగా పంటలు సాగు చేస్తున్న. ఎల్లంపల్లి నీళ్లు వస్తే పొలం పారుతోందని ఆశ పడి వేసిన. బావిలో నీరు కిందికి వెళ్లడంతో ఎకరం పొలానికి నీరందడం లేదు. కోతకు వచ్చే వరకు ఎంత ఎండి పోతుందో తెలియడం లేదు.
– కపిల్ల నరేందర్, తిమ్మాపూర్(చందుర్తి)

ఎత్తిపోతలను పూర్తిచేయాలి



ఈసారి వెంకటరాయిని చెరువులో నీళ్లు ఉన్నాయని ఆశతో నాలుగెకరాల్లో వరి పంట వేసిన. మార్చి నెలలోనే బోరుబావి ఎండిపోయింది. వేసిన పంటను కాపాడుకోవాలని పక్కనే ఉన్న రైతుతో నీటి కోసం మాట్లాడుకున్న. ఎత్తిపోతల పథకాన్ని వేగంగా పూర్తిచేసి రాయినిచెరువులో నీటిని నింపితేనే పంటలు పండుతాయి.
– మాదుగుల లింబాద్రి, వీర్నపల్లి

పంటలు ఎండిపోతున్నాయి



తైబందీ నిర్ణయించడంతో పూర్తి స్థాయిలో పంటలు చేతికొస్తాయనే ఆశతో నాకున్న మూడు ఎకరాలలో వరిపంట వేసిన. కాల్వల్లో ముళ్లపొదలు పెరిగి, పూడికనిండిపోవడంతో గండ్లు పడుతున్నాయి. దీంతో నీళ్లు మా పొలాల దాక రావడం లేదు. అధికారులు స్పందించి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి.
– నూకల శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట

మరమ్మతు పనులు చేపడతాం



ప్రస్తుతం పంటలు సాగు దశలో ఉన్నాయి. ఈ సమయంలో తూములు, కాల్వలకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేం. పంటల సీజన్ ముగిసిన తర్వాత పనులు చేసే అవకాశం ఉంది. సింగసముద్రం నుంచి కాల్వ ప్రారంభమయ్యే మొదట్లోనే తూము పనులు చేసే అవకాశం ఉంది. ఈ పనులు 9వ ప్యాకేజీ ఏజెన్సీ ద్వారా చేయాల్సి ఉంది.
– మద్దుల వెంకటరెడ్డి, నీటిపారుదలశాఖ, ఏఈ

ఆసాముల భిక్షాటన

- ప్రభుత్వ వైఖరిపై నిరసన
- సర్కారు ఆర్డర్లు ఇవ్వాలి..
- బకాయిలు చెల్లించాలని డిమాండ్



సిరిసిల్లలో భిక్షాటన చేస్తున్న ఆసాములు



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: ఐదు రోజులుగా రిలేదీక్షలు చేస్తున్న సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఆసాములు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆదివారం పట్టణంలో భిక్షాటన చేపట్టారు. ఆసాములు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు తమ బాధలు పట్టించుకోవాలని కోరారు. ఇప్పటికే చాలామంది ఆర్థిక ఇబ్బందులతో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నట్లు తెలిపారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సమస్యను పరిష్కరించకుంటే సోమవారం నుంచి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 500 మందితో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. ఆసామల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, కారంపురి వైకుంఠం, గాజుల దేవదాసు, రాంప్రసాద్, పరంధాములు పాల్గొన్నారు.

పనుల్లేక పస్తులుంటున్న నేతన్నలు

వస్త్రపరిశ్రమ బంద్‌తో పదిహేను రోజులుగా సిరిసిల్ల నేతకార్మికులు పస్తులుంటున్నారని తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బీవైనగర్‌లోని పార్టీ ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమ, అనుబంధ రంగాలకు చెందిన 15వేల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడినా సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. వార్పిన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, ఆసాముల సంఘం నాయకులు బింగి సంపత్, నక్క దేవదాసు, బిజిగం సురేష్, గుండేటి కనకయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలు నిర్దయతో ఉన్నారు

సిరిసిల్ల వస్త్రపరిశ్రమ, పద్మశాలీలు, నేతకార్మికులపై కాంగ్రెస్ నేతలు నిర్దయతో ప్రవర్తించడం సరికాదని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేతకార్మికులకు నిరంతర ఉపాధి కోసం ప్రభుత్వం తరఫున ఏటా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి ఆదుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. బకాయిలు, ఆర్డర్లను ఇప్పించకుండా రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. బకాయిలు, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వకుంటే ఈనెల 15న సిరిసిల్లలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విఠల్, వెంగళ శ్రీనివాస్, మండల బాలరాజు, రాపెల్లి దినేశ్, మహేందర్ పాల్గొన్నారు.

రాస్తారోకోను విజయవంతం చేయండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్లలో సోమవారం నిర్వహించే రాస్తారోకోను విజయవంతం చేయాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. తంగళ్లపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్డర్లు ఏలక వస్త్రపరిశ్రమపై ఆధారపడిన కార్మికులు, ఆసాములకు ఉపాధి కరువైందన్నారు. కార్మికులు ఉదయం పది గంటలకు సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ వద్దకు రావాలని కోరారు. తంగళ్లపల్లి పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుడిక్యాల కనకయ్య, ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనె పర్శరాములు, జిల్లా నాయకులు అన్నల్‌దాస్ గణేష్, గంగాధర్, సామల నర్సయ్య, గౌరంతల రాజమల్లు, కోడం వేణు పాల్గొన్నారు.

పంటలు ఎండబెట్టేందుకు ప్రభుత్వ కుట్ర



మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో తోట ఆగయ్య, చిక్కాల రామారావు, రవీందర్‌రావు, అరుణ

- బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- గంభీరావుపేటలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

గంభీరావుపేట(సిరిసిల్ల): యాసంగిలో పంటలకు సాగునీరందించకుండా ప్రభుత్వం ఎండబెట్టడానికి కుట్రలు చేస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే.తారకరామారావు విమర్శించారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలను బూచీగా చూపించి హామీలు అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వంద రోజుల తర్వాత హామీలు అమలు చేయకుంటే ఈనెల 17 తర్వాత తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గంభీరావుపేట, లింగన్నపేటల మధ్య గల మానేరువాగుపై రూ.10కోట్లతో చేపడుతున్న హైలెవల్ బ్రిడ్జి, గంభీరావుపేటలో రోడ్ల విస్తరణకు మంజూరు చేసిన రూ.30కోట్ల పనులను కమీషన్ల కోసం సాగనివ్వకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఈ నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరుతారని జోస్యం చెప్పారు. ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీపీ వంగ కరుణ, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణాధ్యక్షుడు వెంకటియాదవ్, సుమలతశర్మ, సుధాకర్‌శర్మ, లతారెడ్డి, శ్రీమతి, దయాకర్‌రావు, రాజారాం, హన్మంతరెడ్డి, సంపూర్ణ, ఎగదండి స్వామి, రాజేందర్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

27 నుంచి శివకల్యాణోత్సవాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 27 నుంచి 31 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. మహాశివరాత్రి మహోత్సవాలు ముగిసిన తర్వాత శివకల్యాణం వైభవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. 28న ఉదయం కల్యాణం, సాయంత్రం రథోత్సవం, 31న త్రిశూల యాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఇరుకైన ప్రదేశంతో ఇబ్బందులు

రాజన్న భక్తులు, శివపార్వతులుగా చెప్పుకునే వారు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని శివుడిని వివాహమాడడం ఆనవాయితీ. ఆలయంలోని అద్దాల మండపంలో శివకల్యాణోత్సవం నిర్వహిస్తారు. లక్షలాదిగా తరలివచ్చే శివపార్వతులకు ఈ స్థలం ఏ మూలనా సరిపోవడం లేదు. ఇరుకైన ప్రదేశంలో కల్యాణోత్సవం నిర్వహించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఇప్పటికే శివపార్వతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మహాశివరాత్రి జాతరపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతం చేయాలని భక్తులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న మంగళారపు రాజేందర్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి కల్పించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వివిధ శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసి, ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో తమకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. నాయకులు బియ్యంకార్ శ్రీనివాస్, వెల్డి గణేష్, బొద్దుల రవి, ఎండీ ఖాదర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

- నలుగురికి తీవ్రగాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేట శివారులో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టగా.. నలుగురికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన చెప్యాల గంగారాం, చెప్యాల గంగు, దర్శనం శారద, బోయిని ఉమ ఆటోలో శనివారం రాత్రి 10 గంటలకు మండలంలోని చింతకుంట గ్రామానికి వెళ్తున్నారు. భూషణరావుపేట శివారుకు చేరగానే ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల ఆసుపత్రులకు తరలించామని గ్రామస్తులు వివరించారు.

గోదావరి నదిలో మృతదేహం

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ సమీప గోదావరి నది శివారులో ఆదివారం పురుషుడి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు మృతదేహంపై దుస్తులు లేవని, శరీరంపై బొబ్బలు తేలి, కుళ్లిపోయిన స్థితిలో ఉందన్నారు. మృతుడి మెడలో పూసల దండ, నడుముకు మొలిదారం ఉందని, వయస్సు సుమారు 35–40ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 871265 6527 మొబైల్ నంబరుకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు

కరీంనగర్‌క్రైం: పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు వడ్డీతో సహ చెల్లిస్తామని ఉద్దేశపూర్వకంగా మాట్లాడారని తెలిపారు. ప్రగతినగర్‌కు చెందిన ఎన్‌జీవో కార్యకర్త ఆశిష్‌గౌడ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు జేఎల్‌ఎంలకు స్తంభం ఎక్కే పరీక్ష

కొత్తపల్లి (కరీంనగర్): ఆరో విడత జూనియర్ లైన్‌మెన్‌ల నియామకానికి టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ ప్రకటనలో తెలిపారు. జేఎల్‌ఎం అభ్యర్థులకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల సర్టి ఫికెట్స్ పరిశీలన, పోలు ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మానేరు పరివాహక ప్రాంతం వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా కనగర్తి గ్రామ శివారులో పట్టుకొని, విలాసాగర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



రాజన్నకు భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను ఆదివారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వరుసగా మూడు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో భారీగా తరలివచ్చిన భక్తుల సంఖ్య ఇప్పటికీ తగ్గడం లేదు. ఆదివారం అమావాస్య ఉన్నప్పటికీ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. మహాశివరాత్రి జాతర మహోత్సవాలు ముగిసినప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఎక్సైజ్‌లో 'మామూళ్ల' పర్వం

- రెన్యూవల్ పేరుతో వసూళ్లు
- గతంలో కంటే ఈసారి రేటు పెంచిన వైనం
- ప్రతి వైన్స్‌షాపు నుంచి ముట్టజెప్పాల్సిందే..
- కిందిస్థాయి నుంచి పైదాకా తెలిసే తతంగం



గొల్లపల్లి: ఎక్సైజ్‌లోని కొందరు అధికారుల తీరు ఆ శాఖకే తలవొంపులు తెస్తోంది. 'అమ్యామ్యాలకు' అలవాటుపడిన కొందరు జంకుబొంకు లేకుండా బెదిరింపులకు దిగుతూ అక్రమార్జనకు తెరలేపుతున్నారు. ఇటీవల మెట్‌పల్లిలో ఎక్సైజ్ సీఐ, బార్ నిర్వాహకుడి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో 'మామూళ్ల' అంశం తెరమీదకు వచ్చింది. ఇదే విషయంలో సదరు సీఐపై వేటు పడటంతో ఆ స్థానంలో మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మెట్‌పెల్లి సర్కిల్ ఎక్సైజ్, పోలీస్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో బెల్టుషాపులు, వైన్‌షాపుల మధ్య ఒప్పందం చేసుకున్నట్లు ఉన్న ఓ లెటర్ గతంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ లెటర్‌లో మల్లాపూర్ మండలం రేగుంట, రాఘవాపేట్, మొగిలిపేట, మల్లాపూర్ గ్రామాల్లో సర్కార్ అలాట్ చేసిన నాలుగు వైన్ షాపుల నిర్వాహకులకు ఆయా చుట్టుపక్కల గ్రామాల్లోని బెల్టుషాపులను కేటాయించారు. ఈ నిర్వాహకులు తమకు కేటాయించిన వైన్‌షాపులో లిక్కర్ కొనుగోలు చేయకపోతే బెల్టుషాపులపై కేసులు బుక్‌చేస్తామని, పైగా వైన్స్‌షాపు నిర్వాహకులు చెకింగ్‌కు వచ్చినప్పుడు బాటిళ్లపై స్టిక్కర్లను కూడా చూపించి సహకరించాలని సూచించారు. ఈ ఒప్పందం ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు అమల్లోకి వస్తుందని అగ్రిమెంట్‌లో రాసుసుకున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇటీవల ఆ శాఖలో కొందరు అధికారులు బదిలీ అయ్యారు. అయినప్పటికీ మరికొందరి తీరుమాత్రం మారడం లేదని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

పెరగడం 'మామూలే'

మద్యం ధరలు, లైసెన్స్ ఫీజులు పెరిగినట్లుగానే ఎక్సైజ్ శాఖకు వైన్స్, బార్ యజమానుల నుంచి అక్రమంగా వసూలు చేసే మాముళ్లు సైతం పెరిగాయి. దీంతో ఆ శాఖకు ×కిక్కు׳ మామూలుగా ఉండటం లేదు. గతంలో ఇచ్చే మొత్తం కంటే ఈసారి కాస్త ధర పెంచి వసూలు చేస్తున్నట్లు లైసెన్స్‌దారులే చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచి లక్కీడ్రాలో దుకాణాలు కేటాయిస్తున్న విషయం తెల్సిందే. ఈసారి అసెంబ్లీ ఎన్నికల కారణంగా లైసెన్స్ గడువుకు మందే 2023–25 కాలానికి గత ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించారు. లక్కీడ్రా తీసి యజమానులను ఎంపిక చేశారు. చాలాచోట్ల పాత వ్యాపారులే గ్రూప్‌లుగా టెండర్లు వేసి దక్కించుకోగా.. కొన్నిచోట్ల కొత్తవారికి లాటరీ తగిలి దుకాణాలు దక్కాయి. వారు డిసెంబర్ ఒకటి నుంచి మద్యం దుకాణాలు ప్రారంభించారు. దుకాణం పరిధిలో జనాభాను బట్టి ఫీజు చెల్లించాలి. 5వేల జనాభాపైన ఉంటే రూ.50లక్షలు, 20వేల జనాభా ఉంటే రూ.1.10 కోట్లు లైసెన్స్ ఫీజు సర్కారుకు చెల్లించాలి. జిల్లాలో 5 వేల జనాభా పరిధిలోనే అన్ని దుకాణాలు ఉండటంతో రూ.50 లక్షల నుంచి రూ.65 లక్షల లోపే ఫీజులు ఉన్నాయి. ఈ ఫీజు ఆరు వాయిదాల్లో చెల్లించాలి. ఎక్సైజ్ పన్నులు, బ్యాంక్ గ్యారంటీలు, స్టాక్ కొనుగోల్లు అదనం. మద్యం అమ్మినందుకు సాధారణ మద్యంపై 27 శాతం, మధ్యస్థ బ్రాండ్లపై 20 శాతం, ఫారిన్ లిక్కర్, బీర్‌పై 20 శాతం అమ్మకందారుకు రిటైల్ మార్జిన్ ఉంటుంది. ఇవన్నీ నిబంధనల మేరకు చెల్లించినా అధికారుల జేబుల్లోకి మళ్లీ ప్రత్యేకంగా లైసెన్స్‌దారులు ఇవ్వాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. మద్యందందాలో చాలా లొసుగులు ఉండటంతో 'మామూళ్లు' పుచ్చుకోవడం అధికారికంగానే వ్యవస్థీకృతంగా మారిపోయింది.

రెండేళ్లకు రెన్యూవల్స్ పేరుతో..

రెండేళ్ల కాల పరిమితికి మద్యం విక్రయాలు చేసేందుకు దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులు ఎక్సైజ్ శాఖకు ×రెన్యూవల్స్׳ పేరుతో పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెప్తున్నారు. గతంలో ఒక్కో దుకాణానికి రూ.50 వేల వరకు ఉండగా, ప్రస్తుతం కనీసం లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని వైన్‌షాపులకు రూ.1.50 లక్షల వరకు అనధికారికంగా వసూలు చేసినట్లు సమాచారం. జగిత్యాల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి సర్కిళ్ల పరిధిలోని వాటికి రూ.1.40లక్షలు ఫిక్స్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక జిల్లా కేంద్రం సర్కిల్ పరిధిలో నెలకు రూ.12,500 చొప్పు వసూలు చేస్తుండగా.. మండలకేంద్రాల్లో రూ.6వేల నుంచి రూ.8వేల వరకు తీసుకున్నట్లు సమాచారం. ఇవి కాకుండా కొన్ని పోలీసు, ట్రాఫిక్ పరిధిలో అధికారులకు ప్రతి మూడు నెలకోసారి వసూళ్లు జరుగుతున్నాయి. బార్లకు కూడా రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సి వస్తోంది. కరీంనగర్ మద్యం డిపో నుంచి వైన్స్ షాపులకు మద్యం షాపులకు స్టాక్ లిఫ్టు చేయాల్సిందంటే వాహనానికి కొంత అక్కడి సిబ్బందికి ముట్టజెప్తేనే కదులుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల వ్యవహారం కిందిస్థాయి నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు అంతా తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్న వారందరికీ ఇవన్నీ సర్వసాధారణంగా మారాయి. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో వెలుగులోకి రాక విచారణ జరగడం లేదని తెలుస్తోంది.

'కోడ్' తర్వాత యథావిధిగా..

జిల్లాలో మొత్తం 71 మద్యం దుకాణాలు, 19బార్లు ఉన్నాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోడ్ కారణంగా వైన్స్ షాపులకు ప్రధాన ఆదాయ వనరులైన బెల్టుషాపులను ఎత్తేశారు. కేవలం షాపుల్లో మాత్రమే వ్యాపారం సాగింది. అక్కడక్కడ అడ్డదారుల్లో మద్యం విక్రయాలు సాగాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడైనా కోడ్ మాత్రం ఐదో తేదీ వరకూ కొనసాగింది. అప్పటిదాకా పెద్దగా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు జనవరి నుంచి మామూళ్ల పర్వానికి తెరలేపారు. ఇప్పటికే చాలా షాపుల లైసెన్స్‌దారుల నుంచి మామూళ్లు అందుతున్నట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం

శాఖలో పనిచేసే అధికారులు ఎవరైన వైన్స్, బార్ యజమానుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. ఇటీవల శాఖలోని అధికారులు బదిలీ అయ్యారు. మామూళ్లు తీసుకుంటున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్

రెండు గ్రామాల మధ్య ఆలయ వివాదం

- వేంకటేశ్వరస్వామి ఆలయంలో చల్‌గల్ గ్రామస్తుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఆందోళన చేస్తున్న చల్‌గల్ గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం చల్‌గల్, అర్బన్ మండలం హస్నాబాద్ శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద హస్నాబాద్ పేరు పెట్టడాన్ని నిరసిస్తూ చల్‌గల్ గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పురాతన కాలం నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయానికి చల్‌గల్, హస్నాబాద్, చెర్లపల్లె, ఉప్పరపేటకు చెందిన భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా హస్నాబాద్ గ్రామస్తులు ఆలయంపై తమ గ్రామం పేరు రాయడంతో ఆలయానికి వెళ్లిన చల్‌గల్ గ్రామస్తులు నిలదీయగా వివాదం మొదలైంది. ఆదివారం చల్‌గల్ గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు దేవాలయానికి వచ్చి ఆలయంపై ఉన్న పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణ ఏఎస్సై వేణురావు గ్రామస్తులతో మాట్లాడారు. వారిలో ఒక బృందాన్ని పట్టణ పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారు. హస్నాబాద్ గ్రామస్తులను పట్టణ సీఐ వేణుగోపాల్ పిలిపించి ఇరు వర్గాలతో మాట్లాడారు. ఆలయం వద్ద పేరును తొలగించాలని, ఏ ఉత్సవాలు జరిగినా ఇరు గ్రామాల ప్రజలు కలిసికట్టుగా జనాభా ప్రతిపాదికన కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో చల్‌గల్ గ్రామస్తులు శాంతించారు. అనంతరం గ్రామస్తులకు దేవాలయం వద్దే భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో అందరు కలిసి, ఉత్సవాలు నిర్వహించుకోవడంతోపాటు, ఆలయ అభివృద్ధికి పాటుపడాలని అధికారులు సూచించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి



ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలు



బాధితులను పరామర్శిస్తున్న ఆది శ్రీనివాస్

- నలుగురికి గాయాలు
- బోరుమోటార్ దించుతుండగా సంఘటన
- బావుసాయిపేటలో విషాదం



మృతి చెందిన పంబాల భూమయ్య

కోనరావుపేట(వేములవాడ): వ్యవసాయ మోటార్‌ను దించుతుండగా విద్యుత్‌తీగలు తగిలి షాక్ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కోనరావుపేట మండలం బావుసాయిపేటలో విషాదం నింపింది. బావుసాయిపేటకు చెందిన తిక్కల భూమయ్య బోరుబావిలోని మోటార్ కాలిపోయింది. దాన్ని బాగు చేయించి ఆదివారం పంబాల రాజు, కర్నాల మహేశ్, తుపాకుల శ్రీనివాస్, పంబాల భూమయ్యలతో కలిసి బోరుబావిలో మోటార్‌ను దించుతున్నారు. ఈక్రమంలో విద్యుత్ మెయిన్‌లైన్లు ఇనుప పైపులకు తగలడంతో నలుగురు షాక్‌కు గురయ్యారు. గమనించిన తోటి రైతులు నలుగురిని వెంటనే వేములవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పంబాల భూమయ్య మృతిచెందాడు. బాధితులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బైరగోని నందూగౌడ్ పరామర్శించారు. మృతునికి భార్య అనిత, కూతురు గౌతమి, కుమారుడు రేశ్వంత్ ఉన్నారు. కోనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బేస్‌బాల్ కేరాఫ్ కరీంనగర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చల్ల హరిశంకర్, శ్వేత



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: బేస్‌బాల్ క్రీడకు కంచుకోట, కేరాఫ్ కరీంనగర్ జిల్లా అని తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. రాష్ట్ర బేస్‌బాల్, కరీంనగర్ జిల్లా బేస్‌బాల్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 31వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంజాబ్‌లో జాతీయ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు జాతీయ పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం సాధించాలన్నారు. బేస్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత మాట్లాడుతూ, ఈ నెల 22 నుంచి 25 వరకు పంజాబ్‌లోని సంగూర్‌లో జాతీయస్థాయి జూనియర్స్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు సముచిత స్థానం కల్పించి నిధులు విడుదల చేయాలన్నారు. జిల్లా బేస్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిస్‌పాష మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు సుమారు 20 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కృష్ణ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ద్వితీయస్థానం



ద్వితీయస్థానం సాధించిన ఉమ్మడి జిల్లా బాలుర జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగిన 45వ రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించింది. ఫైనల్‌లో ఆతిథ్య వరంగల్ జట్టుపై హోరాహోరీగా తలపడి ఓటమి చెంది ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి జిల్లా జట్టు విజయం సాధించడంపై హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, ఒలింపిక్ సంఘం బాధ్యులు గసిరెడ్డి జనార్దన్, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ వేల్పుల సురేందర్ హర్షం వ్యక్తం చేశారు.

జాతర ఆదాయం రూ.1.20కోట్లు



రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన రాజన్న ఆలయం

- జాతర ఖర్చు రూ.3 కోట్లు
- సమ్మక్క జాతరకే భారీగా వచ్చిన భక్తులు

ఆదాయం ఇలా..

ప్రసాదాలు	రూ.50.19 లక్షలు
కోడె మొక్కులు	రూ.45.83 లక్షలు
ఆర్జిత సేవలు	రూ.1.28 లక్షలు
కేశఖండనం	రూ.3.85 లక్షలు
శీఘ్రదర్శనం	రూ.4.05 లక్షలు
అతిశీఘ్రదర్శనం	రూ.11.37 లక్షలు
బద్దిపోచమ్మ	రూ.1.33 లక్షలు
నగరేశ్వరాలయం	రూ.95 వేలు
వసతి గదులు	రూ.1.83 లక్షలు

వేములవాడ : మహాశివరాత్రి వేడుకల సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామికి భక్తుల ద్వారా రూ.1.20కోట్ల ఆదాయం వచ్చింది. జాతర ఏర్పాట్ల కోసం రూ.3కోట్ల వరకు వెచ్చించారు. ఇటీవల జరిగిన సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకొని వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన భక్తులు ముందస్తుగానే రాజన్నను దర్శించుకొని వెళ్లారు. దీంతో మహాశివరాత్రి వేడుకలకు భక్తుల సంఖ్య తగ్గింది. భక్తుల రాక తగ్గిపోవడంతో ఆదాయం సైతం పడిపోయింది. అయితే కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా భక్తులకు సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

సమ్మక్క జాతర భక్తులతోనే ఆదాయం

ఈసారి సమ్మక్క జాతర సందర్భంగా ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకుని వెళ్లేందుకు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో భక్తులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి వృథా ఖర్చులు, అధికారుల హడావిడి లేకుండా రూ.22కోట్ల ఆదాయం వచ్చింది.

ఆదాయం అంతంతే..

మహాశివరాత్రి జాతర ఆదాయం అంతంతే వచ్చింది. జాతర ఉత్సవాలకు సుమారు రూ.3 కోట్ల వరకు ఖర్చు చేసినం. ఆదాయం రూ.1.20కోట్లు వచ్చాయి. హుండీల ద్వారా మరింత ఆదాయం సమకూరనుంది. సమ్మక్క జాతర సందర్భంగా జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే అత్యధికంగా భక్తులు వచ్చారు. దీంతో రూ.22 కోట్ల ఆదాయం సమకూరింది.

– కృష్ణప్రసాద్, ఈవో

అలరించిన ట్రినిఫెస్ట్



కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో ట్రినిఫెస్ట్ పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రినిటి కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహమ్మాయిదేవి ఆలయంలో సజ్జనార్ పూజలు



పూజలు చేస్తున్న సజ్జనార్ దంపతులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని అతి పురాతన మహమ్మాయిదేవి ఆలయంలో ఆదివారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 500 ఏళ్లనాటి మహమ్మాయి ఆలయం, అమ్మవారి విశిష్టత గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సజ్జనార్ దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు గుండోజు లక్ష్మణ్‌చారి, గజ్జెల హరిహరచారి, ఆలయ ప్రధాన అర్చకుడు చిలుకూరి తిరుపతాచార్యులు, ఎంపీటీసీ రమేశ్ గౌడ్, బీజేపీ మండలం అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్ ఘనంగా సత్కరించారు.



'అల్ఫోర్స్ టైనీటాట్స్' వార్షికోత్సవ వేడుకలు

కొత్తపల్లి(కరీంనగర్): నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి కళల పట్ల అవగాహన ఉండడమే కాకుండా, అందులో పాల్గొనేందుకు ఆసక్తితో ఉండాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్స్ మైదానంలో మౌక్తికం పేరుతో నిర్వహించిన అల్ఫోర్స్ టైనీటాట్స్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ, నేటి ప్రపంచంలో మార్పులు చాలా త్వరగా చోటు చేసుకుంటున్నాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని అగ్రగామిగా ఉండాలన్నారు. విద్యార్థులు సృజనాత్మకతతో ముందుకు పయనించి గుర్తింపు పొందాలన్నారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని త్వరగా సాధించి గొప్పగా వ్యవహరించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.